సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 06 | మంగళవారం | 08.04.2025



# బొచ్చు కుక్క.. గుంట నక్క..



“‘పల్లా రాజేశ్వర్‌రెడ్డి కేసీఆర్ చుట్టూ బొచ్చు కుక్కలా తిరిగి అధికారాన్ని అడ్డంపెట్టుకొని అక్రమంగా వందల కోట్ల ఆస్తులు సంపాదించాడు. ఇప్పుడు అహంకారంతో, పైసల బులుపుతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. బీఆర్ఎస్ పార్టీని భ్రష్టు పట్టిచ్చింది పల్లా రాజేశ్వర్ రెడ్డే..’ అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు.

## పల్లా వర్సెస్ కడియం

- నేతల మధ్య మాటల యుద్ధం
- జనగామ జిల్లాలో వేడెక్కుతున్న రాజకీయం

“‘కడియం శ్రీహరి నన్ను బొచ్చు కుక్క అన్నాడు.. అవును నేను కుక్కనే.. నా ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే వారిని కాపాడేందుకు కాపలా కుక్కగా ఉంటాను.. నీలాగా గుంట నక్కను మాత్రం కాదు..’ అంటూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. సోమవారం జనగామలో ఏర్పాటు చేసిన సమావేశంలో పల్లా కడియంపై ఫైర్ అయ్యారు.




2 లో

## అండర్ పాస్ కోసం ఆందోళన

- స్పష్టమైన ప్రకటన ఇవ్వకుంటే ఎన్‌హెచ్‌ను దిగ్బంధిస్తాం..
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు



General News




**‘పల్లా రాజేశ్వర్‌రెడ్డి కేసీఆర్ చుట్టూ బొచ్చు కుక్కలా తిరిగి అధికారాన్ని అడ్డంపెట్టుకొని అక్రమంగా వందల కోట్ల ఆస్తులు సంపాదించాడు. ఇప్పుడు అహంకారంతో, పైసల బలుపుతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. బీఆర్ఎస్ పార్టీని భ్రష్టు పట్టిచ్చింది పల్లా రాజేశ్వర్ రెడ్డే..’ అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇటీవల ధ్వజమెత్తారు.**

**‘కడియం శ్రీహరి నన్ను బొచ్చు కుక్క అన్నాడు.. అవును నేను కుక్కనే.. నా ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే వారిని కాపాడేందుకు కాపలా కుక్కగా ఉంటాను.. నీలాగా గుంట నక్కను మాత్రం కాదు..’ అంటూ జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. సోమవారం జనగామలో ఏర్పాటు చేసిన సమావేశంలో పల్లా కడియంపై ఫైర్ అయ్యారు.**

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ జిల్లాలో రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. ముఖ్యంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య మాట యుద్ధం కొనసాగుతోంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ వెళ్లిన కడియం పల్లా సందర్భం దొరికినప్పుడుల్లా విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ఇటీవల స్టేషన్‌ఘన్‌పూర్‌లో శ్రీహరి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసిన విషయం తెలిసిందే. దానిపై ఎమ్మెల్యే పల్లా స్పందించారు. కడియం స్టేషన్‌ఘన్‌పూర్ అభివృద్ధికి రూ.800 కోట్లు కాదు కదా.. 8 పైసలు కూడా తేలేదంటూ విమర్శలు చేశారు.

## కడియం కౌంటర్ అటాక్..

పల్లా రాజేశ్వర్ రెడ్డి విమర్శలకు కడియం శ్రీహరి సైతం ఎప్పటికప్పుడు కౌంటర్ ఇస్తూ వస్తున్నారు. ఇటీవల చిల్పూర్ మండలం చిన్నపెండ్యాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పల్లాపై ధ్వజమెత్తారు. కేసీఆర్ చుట్టూ బొచ్చు కుక్కలా తిరిగిన పల్లా రాజేశ్వర్ రెడ్డి అధికారాన్ని, కేసీఆర్ ను అడ్డంపెట్టుకొని అక్రమంగా వందల కోట్ల ఆస్తులు సంపాదించాడని ఆరోపించారు. ఆ పైసల బలుపుతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీని భ్రష్టు పట్టిచ్చిందే పల్లా రాజేశ్వర్ రెడ్డే అని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.800 కోట్ల నిధులు తీసుకొచ్చి జీవోలను ప్రజలముందు పెట్టానని, నియోజకవర్గ చరిత్రలో లేని విధంగా భారీ బహిరంగ సభ పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.

## తగ్గని రాజేశ్వర్‌రెడ్డి..

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మరోసారి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జనగామ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఇటీవల తనను కడియం ‘బొచ్చు కుక్క’ అన్నారని.. ‘అవును నేను కుక్కనే.. నా ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే వారిని కాపాడేందుకు కాపలా కుక్కగా ఉంటాను.. నీలాగా గుంట నక్కను మాత్రం కాదు..’ అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చారు. ‘గతంలో ఘన్‌పూర్‌కు మున్సిపాలిటీ వస్తే ఆపారు.. డిగ్రీ కాలేజీ ఆపారు.. లిఫ్ట్ ఇరిగేషన్ ఆపారు.. 100 పడకల ఆస్పత్రిని ఆపారు. నవాబ్‌పేటకు లైనింగ్ వస్తే దాన్ని కూడా ఆపేశారు. ఆపేసే చరిత్ర వాళ్లది.. పనులు చేయడమనే చరిత్ర మాది..’ అని పల్లా పేర్కొన్నారు. అటవీ భూములపై జరుగుతున్న ఆక్రమణలపై కూడా పల్లా స్పందించారు. ‘కడియం ముసలితనానికి అటవీ భూముల మీద కన్నేస్తున్నారు. ఆ భూములను కాపాడటానికి నేను రేసు కుక్కలా ఉంటాను..’ అని హెచ్చరించారు. ‘నేను కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి విశ్వాసం ఉన్న కుక్కను.. ప్రజలను కాపాడటంలో ఎప్పుడూ ముందుండే లక్షణాలు నాకు ఉన్నాయి. నిన్ను ఎదుర్కొనే గుణాలు కూడా నా వద్ద ఉన్నాయి..’ అంటూ కడియంకు గట్టి కౌంటర్ ఇచ్చారు. మొత్తానికి ఈ ఇద్దరి నేతల మాటల యుద్ధంతో జనగామ రాజకీయాలు హాట్ హాట్‌గా మారాయి.







# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- **సీఎం ప్రజావాణి దరఖాస్తులపై స్పెషల్ ఫోకస్**
- **అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్...**

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని, సీఎం ప్రజావాణి దరఖాస్తులపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు.

బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామం పరిధిలోని రామచంద్ర గూడెంలో 10 సంవత్సరాల కింద రైతులు 60 ఎకరాల్లో నీలగిరి చెట్లు సాగు చేస్తున్నారు. తద్వారా పరిసరాల్లోని సన్న, చిన్నకారు రైతుల వ్యవసాయ భూములకు వేసుకున్న బోర్లలో నీరు ఇంకి పోతున్నదని, చెట్లు తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దేవరుప్పుల మండలంకు చెందిన గోలి సోమిరెడ్డి వారసత్వ భూమి సర్వే నెంబర్లను సరిచేయాలని దరఖాస్తును అందించారు.

లింగాలగణపురం మండలం నేలపోగుల రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 435/4లోని 20 కుంటల భూమి, ఇల్లును తల్లి భూలక్ష్మి అక్క స్వరూపకు పట్టా చేసిందని, వారసత్వ హక్కుగా తనకు రావలసి ఉన్నదని తనకు న్యాయం చేయవలసిందిగా పసునూరి సమ్మయ్య విజ్ఞప్తి చేశారు.

రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామానికి చెందిన వారాల వెంకట నారాయణ తండ్రి యాదగిరి సర్వేనెంబర్ 56/బి/1లో ఒక ఎకరం 22 కుంటల వారసత్వ భూమి 2000 సంవత్సరం నుంచి ధరణి వచ్చే నాటికి పట్టా ఉందని, ధరణి పట్టా పుస్తకంలో అసైన్డ్ భూమి అని నమోదైనందున మార్పు చేయగలరని దరఖాస్తు అందించారు.

లింగాలఘణపురం మండలం సిరిపురం గ్రామానికి చెందిన బొడిగ లక్ష్మయ్య భూమి సర్వే నెంబర్ 230/82లో హైటెన్షన్ లైను కోసం సర్వే చేసి నిర్మాణం చేస్తున్నారని, పరిహారం కోసం సంప్రదించగా భూమి పక్క రైతులదని పరిహారం అందకుండా అధికారులు జాప్యం చేస్తున్నందున పాస్ బుక్ పరిశీలించి తగు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మొత్తంగా గ్రీవెన్స్‌లో 43 దరఖాస్తులను ఆయా సంబంధిత శాఖలకు అందించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమంత నాయక్, ఆర్డీఓ గోపిరామ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



Local News



# అండర్ పాస్ కోసం ఆందోళన

- కలెక్టరేట్ ఎదుట సీపీఎం ధర్నా
- స్పష్టమైన ప్రకటన ఇవ్వకుంటే ఎన్‌హెచ్‌ను దిగ్బంధిస్తాం..
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కేంద్రంలోని బాణాపురం ఇందిరమ్మ కాలనీ వద్ద నిర్మిస్తున్న బైపాస్ రోడ్‌పై అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం నిర్వహిస్తున్న రోజురోజు ఉధృతమవుతోంది. సోమవారం పార్టీ పట్టణ కమిటీ, మండల కమిటీ ఆధ్వర్యంలో బాణాపురం ఇందిరమ్మ కాలనీ దీక్షల శిబిరం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వందలాది మందితో పాదయాత్రగా వచ్చి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ పాదయాత్రను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాపర్తి రాజు జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నా కార్యక్రమానికి సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షత వహించగా రాపర్తి రాజు మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ అధికారుల అనాలోచిత నిర్ణయం ఫలితంగా ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగే ప్రమాదం ఉందన్నారు. బాణాపురం ఇందిరమ్మ కాలనీ వద్ద 72 రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణమన్నారు. అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం జరిగేంతవరకు తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఈనెల 11 వరకు దీక్షా శిబిరం వద్దకు వచ్చి జిల్లా ఉన్నత అధికారులు స్పష్టమైన ప్రకటన చేయకపోతే జాతీయ రహదారిని వందలాది మందితో దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్, జిల్లా కమిటీ



సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, బోడ నరేందర్, భూక్య చందు నాయక్, చిట్యాల సోమన్న, ఎండి అజారుద్దీన్, బిట్ల గణేష్, సీనియర్ నాయకులు ఎండి దస్తగిరి, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు కళ్యాణం లింగం, బాల్నే వెంకటమల్లయ్య, పల్లెర్ల లలిత, మంగ బీరయ్య, బొట్ల శ్రావణ్, బూడిది ప్రశాంత్, పాముకుంట్ల చందు, ధరావత్ మహేందర్, భూనాద్రి వెంకటేష్, పంతం సాయిప్రసాద్, ఎర్ర రజిత, జయ, ఎండి గౌసియా, నాజియా, మల్లేష్, అంజయ్య, యాకయ్య, శివ, అంజమ్మ, పద్మ, వసంత, నీలిమ, మమత, సుగుణ, హరీష్, సంపత్, ఎల్లయ్య, సైదులు, విజేందర్, మధు, సిద్ధమ్మ, పారిజాత, రేణుక, మానస, స్వప్న, లావణ్య, సాయిప్రసాద్, మల్లేష్, రాజు, ఉపేందర్, సుధాకర్ మునీర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందునాయక్ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, జనగామ మార్కెట్ ఇంఛార్జి కార్యదర్శి నరేంద్రకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చందు నాయక్ మాట్లాడుతూ జనగామ వ్యవసాయ మార్కెట్లో రైతుల ధాన్యానికి కనీసం మద్దతు ధర రూ.1850 ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు, అదేవిధంగా ఈ నామ్ లో సమయానికి అనుగుణంగా అడ్తీదారులు, ఖరీదారులు కచ్చితంగా వచ్చే విధంగా చర్యలు చేపట్టారు. వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి రైతులను నష్టం చేకూర్చే విధంగా ఈ నామ్ లో బిడ్డింగ్ లో ధరలు




వేయకుండా ఆఫ్ లైన్ పద్ధతిలో తక్కువ ధరకు అనగా రూ.1600, 1550, 1650 వంటి ధరలకు రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి గత వారం రోజుల నుంచి కొనసాగుతున్నదన్నారు. అదేవిధంగా మార్కెట్లో మొక్కజొన్నల కొనుగోలు మార్క్ఫెడ్ సెంటర్ ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, జిల్లా కమిటీ సభ్యులు బోడ రాములు, ఉర్సుల కుమార్, తాండ్ర ఆనందం తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ భూమిని కాపాడాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణం ధర్మకంచలోని మిని స్టేడియంకు ఎదురుగా ఉన్న ఓ పెన్ జిమ్ స్థలాన్ని కాపాడాలని బీఆర్ఎస్ నాయకుడు పానుగంటి ప్రవీణ్ కోరారు. ఈ మేరకు సోమవారం అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌ను గ్రీవెన్స్ లో వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి అక్రమ నిర్మాణాలను చేసిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన అదనపు కలెక్టర్ అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో నర్రా నవీన్, జేరిపోతుల శ్యామ్, రాజుకుమార్ రోడ్రిక్స్ తదితరులు పాల్గొన్నారు.




# సూపర్‌వైజర్ మరణం బాధాకరం

**కొడకండ్ల, మన చౌరాస్తా :** కొడకండ్ల వ్యసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న గాడిపెల్లి రమేష్ ఆకస్మిక మరణం బాధాకరమని చైర్‌పర్సన్ నల్ల అండాలు శ్రీరాం అన్నారు. రెండు రోజుల కింద రమేష్ చనిపోగా ఆయన స్వగ్రామం మహబూబాబాద్ వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యాలయ సూపర్‌వైజర్‌గా సేవలందించిన రమేష్ కొద్ది కాలంలోనే అందరితో కలిసిమెలిసి ఉన్నాడని, ఆయన మరణవార్త నమ్మలేకపోయామని ఆవేదన ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వృత్తి పట్ల అంకితభావం, సమయపాలన పద్ధతిగా పాటించే రమేష్ లేకపోవడం బాధాకరం అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్లు ప్రకటించారు. సందర్భంగా ఆయన కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు క్రాంతికుమార్, వెంకన్న, వెంకట్ రెడ్డి, నాగరాజు, వీర్య, శ్రీకాంత్ ఉన్నారు.




# రక్తదానం చేసిన యువకుడు

**జనగామ టౌన్, మన చౌరాస్తా :** జనగామ అమ్మ ఫౌండేషన్ పిలుపు మేరకు బచ్చన్నపేట మండలం నక్కవానిగూడెంకు చెందిన కాన్రాజు రవి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమరాజు మాట్లాడుతూ జనగామ జిల్లా ఆస్పత్రిలో రక్తనిధి ఏర్పాటు లక్ష్యంగా ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రవి 9వ సారి రక్తదానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో రమేష్ కుర్మా, హాస్పటల్ సిబ్బంది పూర్ణచందర్, సంపత్ పాల్గొన్నారు.



## బీజేపీ కుట్ర లను తిప్పి కొట్టాలి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమం బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామంలో ఘనంగా ప్రారంభమైంది. డప్పు చప్పుల్లతో పోచన్నపేట గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి మహనీయులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం గురించి గల్లి గల్లిన తిరుగుతూ ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతం చేశారు. అనంతరం బచ్చన్నపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి కార్యక్రమానికి ఇన్‌చార్జిగా వచ్చిన ఆగం రెడ్డితో కలిసి మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని, దానిని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి కావ్యశ్రీ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు అక్కిరెడ్డి శ్రీధర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌ఐసీ ప్రతినిధులకు అభినందన

**జనగామ, మన చౌరాస్తా :** ఎస్ఐసీ 2024-25 సంవత్సరం ఫైనల్ పూర్తి కాకముందే కేటాయించిన కన్వెన్షనల్ బడ్జెట్ పూర్తి చేసిన వారిని సంస్థ అధికారులు అభినందించారు. సోమవారం జనగామ శాఖలో జరిగిన వేడుకల్లో చీఫ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ అడ్వజర్స్ (సీఎల్ఐఏ) 7/7 పిల్లర్స్, శాటిలైట్ ఆఫీస్ స్టేషన్‌ఘన్‌పూర్ 6/7 పిల్లర్స్ ప్రతినిధుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్ ఎం.సుబ్రమణ్యన్, మార్కెటింగ్ మేనేజర్ బి.ప్రసాద్ బస్వరాజ్, సేల్స్ మేనేజర్ రవిశంకర్, బ్రాంచ్ మేనేజర్ హరిలాల్, స్టేషన్‌ఘన్‌పూర్ బ్రాంచ్ మేనేజర్ మోతీలాల్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ ధునిలాల్, సిబ్బంది గట్టు అమర్‌నాథ్, శ్రీనివాస్, కరుణామయి తదితరులు పాల్గొన్నారు.



## ప్రయాణికులకు ఉచితంగా కూల్ వాటర్

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల ఆర్టీసీ బస్టాండులో ప్రయాణీకులకు ఉచితంగా చల్లటి మినరల్ నీటిని అందిస్తున్నట్లు సిద్దిపేట డిపో మేనేజర్ తెప్పల రఘు తెలిపారు. సోమవారం కొత్త బస్టాండులో కూల్ వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ ను మేనేజర్ రఘు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఆర్టీసీ సంస్థ, సిద్ధిపేట డిపో తరుపున సుమారు రూ.80 వేల విలువ గల కూల్ వాటర్ మిషన్ ను బస్టాండులో అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సిద్ధిపేట బస్టేషన్ మేజర్ బాలకిషన్, చేర్యాల కార్గో ఇంచార్జ్ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

- **అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్**



**జనగామ, మన చౌరాస్తా :** వరి కోతలు ప్రారంభమైనందున వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం రబి సీజన్‌ను పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం రాకను బట్టి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి కేంద్రం పూర్తి స్థాయిలో పనిచేసే వరకు రెవెన్యూ వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షణ చేస్తూ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్డిఓ గోపిరామ్, వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్, సహకార శాఖ అధికారి రాజేందర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి సరస్వతి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హథిరాం పాల్గొన్నారు.

## డ్రగ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని చేర్యాల ఎస్సై నిరేష్ అన్నారు. సోమవారం చేర్యాల మండలం గుర్జకుంటలో యువతను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా అందరూ కలిసి మెలిసి ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీస్ స్టేషన్‌కు రావాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించిన వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెషనరీ ఎస్సై సమత, పోలీస్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## రేషన్ షాపుల వద్ద ప్రధాని ఫొటో పెట్టాలి



**జనగామ, మన చౌరాస్తా :** రేషన్ షాపుల వద్ద ప్రధాని నరేంద్ర మోడీ ఫొటో పెట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మకంటి అనిల్ డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన(పీఎంజీకేఏవై) పథకంలో భాగంగా తెల్లరేషన్ కార్డు కలిగిన కుటుంబంలోని ప్రతి వ్యక్తి కి 5 కిలోల చొప్పున బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని, ఈ క్రమంలో ప్రతి రేషన్ షాపు వద్ద ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని పెట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఈ విషయాన్ని సోమవారం ప్రజావాణిలో అనిల్ అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ఆరు. ప్రతీ రేషన్ షాపు వద్ద మోడీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో తామే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు పవన్ శర్మ, నాయకులు గోధుమలు అశోక్, తోకల హరీష్, ఉల్లెంగుల రాజు తదితరులు పాల్గొన్నారు.





'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812



## బేబీకి ఆఫర్లు

బేబీ సినిమాతో తెలుగు చిత్రపరిశ్రమలో స్టార్ డమ్ సంపాదించుకుంది హీరోయిన్ వైష్ణవి చైతన్య. దీంతో ఈ బ్యూటీకి తెలుగులో వరుస ఆఫర్స్ వచ్చాయి. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ సరసన జాక్ చిత్రంలో నటిస్తుంది ఈ వయ్యారి. ఈ మూవీ ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలకానుంది. ఈ క్రమంలోనే జాక్ మూవీ ప్రమోషన్లలో భాగంగా సిద్ధు, వైష్ణవి ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల భీమవరంలోని విష్ణు కాలేజీలో నిర్వహించిన ఈవెంట్లో జాక్ చిత్రయూనిట్ సందడి చేసింది. ఈ కార్యక్రమంలో అక్కడి విద్యార్థులతో సిద్ధు, వైష్ణవి ఇంట్రాక్ట్ అయ్యారు. అక్కడి స్టూడెంట్స్ చేసిన అల్లరి, డ్యాన్సులు చూసి మురిసిపోయారు. ఈ క్రమంలోనే స్టేజ్ మీద వైష్ణవి మాట్లాడుతూ స్టూడెంట్ లైఫ్, కాలేజీ జీవితం గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. అదే సమయంలో భీమవరంలో అని మర్చిపోయి రాజమండ్రి అనేసింది. ప్రస్తుతం జాక్ సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉంది హీరోయిన్ వైష్ణవి చైతన్య. కొన్ని రోజులుగా హీరో సిద్ధు జొన్నలగడ్డతో కలిసి పలు ఇంటర్వ్యూలు, ఈవెంట్లలో పాల్గొంటుంది. తాజాగా భీమవరంలో జరిగన ఈవెంట్లో పాల్గొన్న ఈ బ్యూటీ ఆ ఊరు పేరునే మర్చిపోయింది. దీంతో ఆమెకు హీరో సిద్ధు జొన్నలగడ్డ సాయం చేశారు.

## హిట్ కోసం అఖిల్ వెయింటింగ్!

టాలీవుడ్ స్టార్ కిడ్స్‌లో సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న వారిలో టాప్‌లో ఉంటాడు అక్కినేని అఖిల్. వివి వినాయక్ డైరెక్షన్‌లో 'అఖిల్' సినిమాతో లీడ్ యాక్టర్‌గా డెబ్యూ ఇచ్చిన ఈ అక్కినేని యాక్టర్ ఆ తర్వాత బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయాడు. 2023లో వచ్చిన ఏజెంట్ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టడంతో ఈ సారి సరికొత్త ప్రయత్నంతో సక్సెస్ కొట్టాలనే కసితో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. తాజాగా అఖిల్ 6 ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. ప్రేమ కంటే హింసాత్మకమైన యుద్ధం మరొకటి లేదు.. అంటూ పిడికిల్ బిగించిన లుక్ ఒకటి రిలీజ్ చేశారు మేకర్స్. టైటిల్ గ్లింప్స్‌ను ఏప్రిల్ 8న విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. అఖిల్ చేతి మణికట్టుపై ఖడ్గంతో డిజైన్ చేసిన కడెంను చూడొచ్చు. అఖిల్ ఈ సారి ఏదో గట్టి ప్లాన్‌తోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. వినరో భాగ్యము విష్ణు కథ ఫేం మురళీ కిశోర్ అబ్బూరు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, అన్నపూర్ణ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్న ఈ మూవీకి సంబంధించి పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిరచనున్నారు మేకర్స్.

